


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
14-10-2025
పేజీలు: 02




క్యూనెట్ వంటి గొలుసుకట్టు సంస్థలు సమాజంపై

## తీవ్ర ప్రభావం : సజ్జనార్

మోసపూరిత మల్టీ లెవెల్ మార్కెటింగ్ సంస్థ క్యూనెట్ మరో యువకుడి ప్రాణాన్ని బలిగొంది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన హరికృష్ణ అనే యువకుడు క్యూనెట్ వలలో చిక్కుకుని బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై ఐపీఎస్ అధికారి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ, "క్యూనెట్ వంటి గొలుసుకట్టు సంస్థలు సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అధిక లాభాల ఆశ చూపి యువతను ఆర్థికంగా నాశనం చేసి, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇది సమాజానికి పెను ముప్పు" అని హెచ్చరించారు. ఇలాంటి మోసపూరిత సంస్థల బారిన పడి యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు.హరికృష్ణ ఆత్మహత్య కేసులో సిద్దిపేట కమిషనరేట్ పోలీసులు చేపట్టిన దర్యాప్తును సజ్జనార్ ప్రశంసించారు. ఈ కేసులో వేగంగా స్పందించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడంపై పోలీసులకు అభినందనలు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసే దిశగా పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.గతంలో వీసీ సజ్జనార్ ఇలాంటి అనేక మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలపై ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. యువత, నిరుద్యోగులు సులభంగా డబ్బు సంపాదించవచ్చనే మాయమాటలను నమ్మి ఇలాంటి స్కీముల్లో చేరి జీవితాలను నాశనం చేసుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




## ఐపీఎస్ పూరన్ ఆత్మహత్య కేసు.. లీవ్‌పై వెళ్లిన హర్యానా డీజీపీ

హర్యానాలో ఐపీఎస్ పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న కేసులో.. ఆ రాష్ట్ర డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను ప్రభుత్వం లీవ్‌పై పంపింది. ఆ ఆత్మహత్య కేసులో నమోదు అయిన ఎఫ్ఐఆర్‌లో శత్రుజీత్ కపూర్ పేరు కూడా ఉన్నది. రోహతక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాను కూడా మార్చుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కపూర్‌ను లీవ్‌పై పంపినట్లు సీఎం మీడియా సలహాదారుడు రాజీవ్ జైట్లీ వెల్లడించారు. ఐపీఎస్ పూరన్ కుమార్ తన సూసైడ్ నోట్‌లో పలువురు ఆఫీసర్ల పేర్లను ప్రస్తావించారు. దాంట్లో కపూర్, బిజార్నియాతో పాటు రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు ఉన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నట్లు విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో.. హర్యానాలోని బీజేపీ సర్కారు డీజీపీని మార్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.



## పత్తి రైతులకు గుడ్ న్యూస్.. క్వింటా ధర రూ.8,110

పత్తి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ నెల 21 నుంచి రాష్ట్రంలో పత్తి కొనుగోలును ప్రారంభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 30 కేంద్రాల్లో ఈ కొనుగోళ్లు జరుగుతాయి. ఈ మిల్లుల ఎంపిక ప్రక్రియ టెండర్ల ద్వారా జరుగుతుంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బృందం మిల్లులను పరిశీలించనుంది. కొనుగోలు కేంద్రాల వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటిస్తారు. ఈ ఏడాది పత్తికి మద్దతు ధర క్వింటా రూ.8,110 ప్రకటించింది.



## విశాఖలో గూగుల్ AI హబ్.. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త మైలురాయి

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మరో చారిత్రక ఘట్టం నమోదు కావడానికి సిద్ధమైంది. మంత్రి నారా లోకేష్ కృషితో విశాఖపట్నంలో దేశంలోనే తొలి గూగుల్ AI హబ్ ఏర్పాటుకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రానికి భారీ ఆర్థిక, ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయి.గూగుల్ 10 బిలియన్ అమెరికన్ డాలర్ల (సుమారు రూ.87,250 కోట్లు)తో విశాఖలో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇది భారతదేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డిఐ ప్రాజెక్ట్ కానుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.47,720 కోట్ల ఆర్థిక లాభం, 1.88 లక్షల ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. గూగుల్ క్లౌడ్ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రాష్ట్రానికి అదనంగా సుమారు రూ.9,553 కోట్ల వార్షిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. విశాఖపట్నం AI సిటీగా రూపాంతరం కావడం ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతకు AI నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటనలో గూగుల్ బృందంతో చర్చలు జరపడం ద్వారా ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రాండింగ్, మంత్రి లోకేష్ కృషి కలిసి రాష్ట్రానికి అత్యంత ముఖ్యమైన విదేశీ పెట్టుబడిని సాధించాయన్నారు. ప్రపంచ దృష్టి ఆంధ్రప్రదేశ్ పై ఉండేలా ఈ ప్రాజెక్ట్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ AI, టెక్ హబ్‌గా నిలబెడుతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

**ప్రధాని మద్దతుతోనే సాధ్యం.. గూగుల్‌తో ఒప్పందంపై సీఎం**

గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం నాడు విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ఢిల్లీలో జరిగిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మద్దతుతో ఇది సాధ్యం అయ్యిందన్నారు. తాను చూసిన ప్రధాన మంత్రులలో మోదీ ప్రత్యేకమన్నారు. విజినరీ, ఆలోచన తీరు, నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ఎవరూ అందుకోలేరని కొనియాడారు. ప్రధాని సారథ్యంలో 2047 కంటే ముందుగానే భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని స్పష్టం చేశారు.



## రవితేజ బయోపిక్ తీయాలనుకున్నా - సిద్ధు

యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ మాస్ మహారాజ రవితేజతో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ రవితేజ బయోపిక్ తీయాలని గతంలో సీరియస్‌గా ప్లాన్ చేశానని తెలిపారు. రవితేజ జర్నీ తనకు ఇన్‌స్పైరింగ్‌గా అనిపించిందని అయితే కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ఆగిపోయిందని చెప్పారు. దీనిపై స్పందించిన రవితేజ బయోపిక్‌లలో నెగెటివ్ కోణాన్ని కూడా చూపించాలని అప్పుడే అది నిజంగా అనిపిస్తుందని అన్నారు. తాను కూడా ఒక నటుడి బయోపిక్ తీసే ఆలోచనలో ఉన్నానని కానీ ఆ నటుడు ఎవరో చెప్పలేదు.

## టెస్టు కెప్టెన్‌గా శుభమన్ గిల్ ఖాతాలో రికార్డు

టీమిండియా టెస్టు కెప్టెన్ శుభమన్ గిల్ తన ఖాతాలో కొత్త రికార్డు వేసుకున్నాడు. టెస్టు కెప్టెన్సీ చేపట్టిన తర్వాత తొలిసారి ఓ సిరీస్‌ను కైవసం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను ఇండియా క్లీన్ స్వీప్ చేసింది. దీంతో కెప్టెన్‌గా రెండో సిరీస్‌లోనే అతను విజయాన్ని తన రికార్డుల్లోకి చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌కు కూడా సారథ్య బాధ్యతలను గిల్ చేపట్టాడు. విదేశీ గడ్డపై జరిగిన ఆ సిరీస్ 2-2 తేడాతో సమం అయ్యింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి సీనియర్ క్రికెటర్లు టెస్టు క్రికెట్‌కు దూరం కావడంతో.. వారి స్థానంలో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన గిల్ తన సారథ్య లక్షణాలతో ఆకట్టుకున్నాడు. ప్రధాన బ్యాటర్‌గా రాణించడంతో పాటు జట్టులోని ప్లేయర్లను మేనేజ్ చేసిన విధానంలోనూ గిల్ సక్సెస్ అయ్యాడు. విండీస్‌తో మ్యాచ్ ముగిసిన తర్వాత గిల్ మీడియాతో మాట్లాడారు. కెప్టెన్సీని గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. అయితే ఆ బాధ్యతలను సక్రమంగా నిర్వహించే విధానాన్ని అలవరుచుకుంటున్నట్లు తెలిపారు. ఆటగాళ్లను ఎలా మ్యానేజ్ చేయాలన్న అంశాలను కూడా నేర్చుకున్నట్లు చెప్పారు. మ్యాచ్ పరిస్థితికి అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకోవడం కీలకం అన్నారు. రెండో టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 300 పరుగల ఆధిక్యంలో ఉన్నామని, పిచ్ చాలా నిర్జీవంగా ఉందని, అందుకే ఫాలోఆన్




ఆడించామన్నారు. స్పీడ్ బౌలింగ్ వేసే ఆల్‌రౌండర్లు విదేశీ పిచ్‌లపై అవసరం ఉంటుందని, అందుకే నితీశ్ కుమార్ రెడ్డికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఒక బ్యాటర్‌గా నిర్ణయాలు తీసుకుంటానని, కానీ కెప్టెన్‌గా కాదన్నారు. చిన్నతనం నుంచే జట్టును గెలిపించే తత్వాన్ని నేర్చుకున్నట్లు చెప్పారు. వెస్టిండీస్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2-0 తేడాతో ఇండియా స్వీప్ చేసింది. బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా చేతుల మీదుగా కెప్టెన్ శుభమన్ గిల్ ట్రోఫీని అందుకున్నారు. ఈ సిరీస్‌లో అద్భుత ప్రదర్శనక కనబరిచిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు మ్యాన్ ఆఫ్ సిరీస్ అవార్డు దక్కింది. ఓ టెస్టు మ్యాచ్‌లో జడేజా సెంచరీ చేశాడు. ఇక రెండు మ్యాచుల్లో కలిపి అతను 8 వికెట్లు కూడా



తీసుకున్నాడు. అహ్మదాబాద్ ఇన్నింగ్స్‌లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు కూడా దక్కిందతనికి. ఆరో స్థానంలో బ్యాటింగ్ చేపట్టడం సంతోషంగా ఉందన్నాడు. కోచ్ గౌతం గంభీర్ తనకు అవకాశం కల్పించినట్లు జడేజా పేర్కొన్నాడు.





## రిస్క్ అవసరమా అంటున్న ఫ్యాన్స్

తమన్నా భాటియా గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. శ్రీ, హ్యాపీడేస్‌లాంటి చిన్న సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నది. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే బడా హీరోలందరితో నటించి అగ్రహీరోయిన్‌గా ఎదిగింది. దశాబ్దంపైగా దక్షిణాది ప్రేక్షకులను తన అందచందాలు, అభినయంతో మెప్పించింది ఈ మిల్కీ బ్యూటీ. కొంతకాలంగా దక్షిణాదిలో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. ప్రస్తుతం పలు చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో కనిపించింది. తాజాగా తన కెరీర్‌లోనే తొలిసారిగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ప్రముఖ హారర్ బోల్డ్ ఫ్రాంచైజీ 'రాగిణి MMS' సిరీస్‌లో హీరోయిన్‌గా ఎంపికైందని సమాచారం. ఫిలిం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్న వార్త ప్రకారం.. ఈ హారర్-థ్రిల్లర్ ప్రాజెక్ట్ కోసం 'ఏక్తా కపూర్' స్వయంగా తమన్నాను సంప్రదించారట.

# తెలంగాణలో రేవంత్ సర్కార్ విప్లవాత్మక నిర్ణయం: ప్రజల జీవన శైలి మారనుంది!

సమాజాన్ని మార్చే ఏకైక ఆయుధం విద్యనే అంటారు. ప్రత్యేకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే, అందరికి సమాన అవకాశాలు కల్పించి, ఆ వర్గాల విద్యార్థులను విద్యాసంస్కృతితో పరిపూర్ణులుగా మార్చడమే ముఖ్యమని మహానుభావులు మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వసించి, ఈ లక్ష్యానికి గరిష్టంగా కృషి చేశారు.ఈ మహానుభావుల స్ఫూర్తిని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. కేవలం బీసీ రిజర్వేషన్లు పెంచడంలోనే కాకుండా, ఎస్సీ వర్గాల విభజన వంటి విధానాలపై దృష్టి పెట్టడమే కాదు, వారి పిల్లలను విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తోంది.అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి, మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యా నిధి పథకాల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలలో పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చదవడానికి ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. ఈ పథకాలు ప్రారంభమైనప్పటినుండి ఆసక్తి రెట్టింపు అయ్యింది. అయితే, గత ప్రభుత్వం పథకాలను సమీక్షించి అర్హుల సంఖ్య పెంచకపోవడంతో వేలాది అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని పొందలేకపోయారు. విదేశాల్లో ఉన్నత విద్య చదవడం అనేది చాలామందికి కల. కానీ ఖర్చులు ఎక్కువగా ఉండటంతో ప్రతిభ ఉన్న విద్యార్థులు కూడా ఆ దిశగా ఆలోచించలేరు. అలాంటి వారికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి, జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యా నిధి పథకాలు వరం లాగా ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రతిభ ఉన్నా ఉన్నత విద్యకు చేరుకోలేని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు సహాయం అందించాలని నిర్ణయించింది.ఇది వారి జీవితాల్లో గేమ్‌చేంజర్‌గా మారే పథకాల అమలు కోసం స్కాలర్‌షిప్‌ల సంఖ్యను రెట్టింపు చేసే విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల విదేశాల్లో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. గడచిన కాలంలో ఈ మూడు పథకాల కింద లబ్ధిదారుల సంఖ్య 1,110గా ఉండగా, కొత్త ప్రజా ప్రభుత్వ నిర్ణయంతో 1,900కు చేరింది.మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యా నిధి కింద గతంలో




300 మంది బీసీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉండేది. ఇందులో ఈబీసీల కోసం కేవలం 15 సీట్లు ఉండేవి. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ సంఖ్యను 700కి పెంచింది. ఇందులో 500 బీసీ విద్యార్థులకు, 200 ఈబీసీ విద్యార్థులకు కేటాయించారు. అంటే బీసీ విద్యార్థులకు లభించే అవకాశం సుమారు 133 శాతం పెరిగింది. ప్రస్తుతం 500 మంది బీసీ-సీ, బీసీ-ఈ వర్గాల విద్యార్థులు స్కాలర్‌షిప్ పొందుతున్నారంటే, కొత్తగా మరో 500 మంది బీసీ విద్యార్థులు కూడా లబ్ధిదారులుగా మారతారు. మొత్తం దృష్ట్యా ఏడాది లక్ష్యం 1,000 మంది బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం.అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి కింద గతంలో 210 మంది ఎస్సీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ఈ సంఖ్యను 500కి పెంచింది.



## టీసీఎస్ ఉద్యోగులకు పెద్ద షాక్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1బీ వీసా ఫీజు పెంపు సంచలన నిర్ణయం విదేశీ విద్యార్థులకు భారీ షాక్ ఇచ్చింది. ఈ నిర్ణయంతో అమెరికాలోని టెక్ దిగ్గజ సంస్థలు ఆందోళనలో పడిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సీఈవో కే. కృతివాసన్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ సంవత్సరం హెచ్1బీ వీసా కింద అమెరికాలో ఉద్యోగాలు పొందాలనుకునే వారికి తమ సంస్థలో కొత్త అవకాశాలు ఇవ్వనన్నారు. ప్రస్తుతం టీసీఎస్ అమెరికాలో సుమారు 32 వేల నుంచి 33 వేల వరకు ఉద్యోగులు ఉన్నారని, అందులో 11 వేల మంది హెచ్1బీ వీసా ఆధారిత ఉద్యోగులని ఆయన వెల్లడించారు. ఇక ఈ సంవత్సరం భారత్ నుండి సుమారు 500 మంది హెచ్1బీ వీసాలతో అమెరికాకు పంపించారు. అయితే ఇకపై కొత్త హెచ్1బీ ఉద్యోగులను నియమించుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా స్థానిక అమెరికా ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తామని కూడా పేర్కొన్నారు.

# ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకెంతో మంచి స్నేహితుడని, ఆయన అద్భుతంగా పనిచేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని ముగింపు పలుకుతూ కుదిరిన చారిత్రక గాజా శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన అనంతరం, ఈజిప్టులోని షర్మ్ ఎల్-షేక్‌లో సోమవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్ ఒక గొప్ప దేశం, దానికి నా మంచి స్నేహితుడు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన చాలా గొప్పగా పనిచేస్తున్నారు" అని ట్రంప్ అన్నారు. ఇటీవల ప్రధాని మోదీ, ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన కొద్ది రోజులకే ఈ ప్రశంసలు రావడం గమనార్హం. చారిత్రాత్మక గాజా శాంతి ఒప్పందం విజయవంతమైనందుకు గాను ట్రంప్‌కు మోదీ అభినందనలు తెలిపారు. ఈ విషయాన్ని గత వారం ప్రధాని మోదీ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. తమ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలో వాణిజ్య చర్చల్లో సాధించిన పురోగతి గురించి కూడా సమీక్షించినట్టు పేర్కొన్నారు. నెల రోజుల వ్యవధిలో ఇరు నేతలు ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది రెండోసారి.ఇదే సమయంలో భారత్‌కు అమెరికా కొత్త రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ ప్రస్తుతం దేశంలో పర్యటిస్తున్నారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ఇప్పటికే ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమయ్యారు. శనివారం ప్రధాని మోదీతో భేటీ అయిన సందర్భంగా




ఈ ఏడాది ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో వారిద్దరూ సమావేశమైనప్పటి ఫొటో ఫ్రేమ్‌ను గోర్ బహుమతిగా అందించారు. ఆ ఫొటోపై "మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, మీరు చాలా గొప్పవారు!" అని ట్రంప్ స్వయంగా సంతకం చేసి రాశారు.ట్రంప్, మోదీల బలమైన నాయకత్వంలో ఇరు దేశాల మధ్య రక్షణ, వాణిజ్యం, సాంకేతికత వంటి కీలక రంగాల్లో సంబంధాలు అద్భుతంగా ఉన్నాయని గోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రంప్ మోదీని గొప్ప వ్యక్తిగత మిత్రుడిగా భావిస్తారని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో తమ సంబంధం రానున్న నెలల్లో మరింత బలపడుతుందని గోర్ 'ఎక్స్'లో పోస్ట్ చేయగా, ఆయన నియామకం ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని తాను విశ్వసిస్తున్నట్టు మోదీ బదులిచ్చారు.




## భారీ గుమ్మడికాయ.. బరువు అక్షరాలా 1,064 కిలోలు

అమెరికాలోని సాంట రోసాకు చెందిన ఇంజినీర్ బ్రాండన్ డ్వాసన్ భారీ గుమ్మడికాయను పండించారు. ఆ గుమ్మడికాయ బరువు అక్షరాలా 1,064 కిలోలు. దీన్ని కాలిఫోర్నియాలో జరిగిన పోటీల్లో ప్రదర్శించి డ్వాసన్ విజేతగా నిలిచారు. గత ఏడాది 3 కిలోలు తక్కువ బరువుతో గెలుపు రాకపోవడంతో తీవ్ర ఆవేదన చెందారట. ఈ సారి గెలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా భారీ గుమ్మడికాయలు పండిస్తున్న డ్వాసన్, ఈ విజయంలో భాగంగా 20 వేల డాలర్ల బహుమతిగా పొందారు.

## మోహిత్‌కు స్వర్ణం, వైశాలికి రజతం


భువనేశ్వర్ వేదికగా జరుగుతున్న జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ అథ్లెట్లు అదరగొట్టారు. సోమవారం జరిగిన పురుషుల అండర్-20 3000మీటర్ల రేసును రాష్ట్ర యువ ప్లేయర్ 8:13:63 సెకన్లలో ముగించి పసిడి పతకంతో మెరిశాడు. ఇదే కేటగిరీలో రాహుల్‌కుమార్(చత్తీస్‌గఢ్), రుతిక్‌వర్మ(మహారాష్ట్ర) రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. మరోవైపు బాలికల అండర్-18 హెప్టాథ్లాన్ ఫైనల్లో బి.వైశాలి రజత పతకంతో మెరిసింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన రేసులో ఏడు ఈవెంట్లలో వైశాలి అద్భుత ప్రదర్శన కనబరిచింది. తొలి రోజు జరిగిన నాలుగు ఈవెంట్లలో 2648 పాయింట్లు దక్కించుకున్న వైశాలి..మరో మూడు ఈవెంట్లలో 1829 పాయింట్లు ఖాతాలో వేసుకుని రెండో స్థానంలో నిలిచింది. నిరుపేద కుటుంబానికి చెందిన వైశాలి..జాతీయ స్థాయిలో సత్తాచాటింది. ఇదే విభాగంలో సీమ, ముస్కాన్(హర్యానా) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

# ప్రజల ఆరోగ్య రక్షణ ప్రభుత్వ ప్రాధాన్యత –దామోదర్ రాజనర్సింహ

రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల పనితీరు, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సచివాలయంలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల కేసులు గణనీయంగా తగ్గాయని వారు మంత్రికి వివరించారు.గతేడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు చికున్‌గున్యా 361 కేసులు నమోదవగా, ఈ ఏడాది అదే కాలంలో 249 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. అలాగే, మలేరియా కేసులు గతేడాది 226 ఉండగా, ఈ ఏడాది 209కి తగ్గాయని వెల్లడించారు. టైఫాయిడ్ కేసులు కూడా గణనీయంగా తగ్గి, గతేడాది 10,149 నుంచి ఈ ఏడాది 4,600 కేసులకు తగ్గాయని పేర్కొన్నారు. అలాగే డెంగీ కేసులు గతేడాదితో పోలిస్తే దాదాపు 2,900 తక్కువగా ఉన్నాయని అధికారులు నివేదికలో వివరించారు.ఈ వివరాలను పరిశీలించిన మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల ప్రభావం తగ్గడం సంతోషకరమని పేర్కొన్నారు. అయితే, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు మరో నాలుగైదు జిల్లాల్లో కొద్దిగా కేసులు పెరిగినట్లు గుర్తించి, ఆ జిల్లాల్లో యాంటిలార్వల్ ఆపరేషన్లను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు.కొన్ని జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా పడుతున్న నేపథ్యంలో, స్థానిక వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వర్షాల అనంతరం వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉండేందున, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.వాతావరణ మార్పులతో కలిగే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్య విభాగం తరచుగా




ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజల్లో అవగాహన పెంపొందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.వర్షాలు పడుతున్న జిల్లాల్లో ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పర్యటించి పరిస్థితులను సమీక్షించాలని కూడా మంత్రి సూచించారు. ఇంటిని పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీజనల్ వ్యాధులు సోకిన సందర్భంలో ప్రభుత్వ దవాఖానల వైద్య సేవలను వినియోగించుకోవాలని మంత్రి ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.



## ధ్రువ్ విక్రమ్ –మారి సెల్వరాజ్ ‘బైసన్’ ట్రైలర్ విడుదల

తమిళ స్టార్ నటుడు చీయాన్ విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ సంచలన దర్శకుడు మారి సెల్వరాజ్ (కర్ణన్, మామన్నన్ ఫేమ్) కాంబినేషన్‌లో తెరకెక్కిన తాజా చిత్రం ‘బైసన్’. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 17న తమిళంలో విడుదల కాబోతుండగా.. తెలుగులో అక్టోబర్ 17న రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే ఈ చిత్రం కబడ్డీ ఆట నేపథ్యంలో రాబోతుంది. 1980ల నాటి గ్రామీణ తమిళనాడు వాతావరణంలో, కబడ్డీ ఆటగాడి జీవిత పోరాటం, అణగారిన వర్గాల కష్టాలు, సామాజిక వివక్షపై వారి తిరుగుబాటు వంటి అంశాలను దర్శకుడు మారి సెల్వరాజ్ తనదైన శైలిలో చూపించనున్నట్లు ట్రైలర్ స్పష్టం చేసింది. ధ్రువ్ విక్రమ్ కబడ్డీ ఆటగాడిగా కనిపించబోతుండగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తుంది. పశుపతి, రజిషా విజయన్, అమీర్, లాల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## NHAI అదిరిపోయే ఆఫర్.. టాయిలెట్లపై ఫిర్యాదుకు రూ.1,000



వాహనదారులకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) అదిరిపోయే ఆఫర్‌ను ప్రకటించింది. టోల్ ప్లాజాల్లోని అపరిశుభ్రమైన టాయిలెట్లపై ఫిర్యాదు చేస్తే, వారి ఫాస్టాగ్ అకౌంట్‌లోకి రూ.1,000 రివార్డ్ జమ చేయబడుతుంది. ఈ ఆఫర్ అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉంటుంది. వినియోగదారులు 'రాజమార్గ్ యాత్ర' యాప్‌లో టైమ్ స్టాంప్‌తో పాటు అపరిశుభ్రమైన టాయిలెట్ల ఫోటోలను అప్‌లోడ్ చేయాలి. అర్హత కలిగిన వారికి ఈ రివార్డు లభిస్తుంది. NHAI నిర్వహించే టాయిలెట్లకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది.



## ఎద అందాలతో కుర్రకారును మత్తెక్కిస్తున్న సన్యా మల్హోత్రా

దంగల్ మూవీతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన సన్యా మల్హోత్రా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా లెహంగాలో ఎద అందాలు చూపిస్తున్న ఫొటోలు షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతున్నాయి.సన్యా మల్హోత్ర ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మిసెస్' . జీ5 ఓటీటీ వేదికగా విడుదలైన ఈ చిత్రంపై ఓ పురుష హక్కుల సంస్థ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చిత్రాన్ని విమర్శిస్తూ పోస్ట్ పెట్టింది.